# ప్రేరణ

సత్యమూర్తిని పరీక్షించాడు డా॥రఘురాం.

"నాన్న కెలా ఉంది డాక్టర్" అడిగాడు సందీప్.

అతడి కంఠంలో కంగారు, చూపుల్లో దీనత్వం.

"ఆందోళన చెందవలసిన పనిలేదు. కాకపోతే బి.పి. ఎక్కువగా ఉంది. క్రమం తప్పకుండా ఈ మందులు వాడితే సరిపోతుంది" ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు రఘురాం.

ఇంకేదో అడగబోయాడు సందీప్.


"మందుల కంటే ముందు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. బైది బై ఆయనకేమైనా సమస్యలున్నాయా?"

"అబ్బే! అటువంటివేమీ లేవు. ముప్పై మూడేళ్ళ ప్రభుత్వ ఉద్యోగం చేసి హాయిగా రిటైరయ్యారు. నేను, మా తమ్ముడే ఆయన సంతానం. ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటున్నాం. ఆర్థిక ఇబ్బందులు అసల్లేవు. సర్వీసులో ఉండేటప్పుడు హుషారుగానే ఉండేవారు. పదవీ విరమణ చేశాకే....."

"అర్థమయింది. వ్యాపకమేదీ లేకపోవడమే అందుక్కారణం. వయసు అయిపోతోందన్న నిస్పృహతో ఉన్నట్లుంది. మీరంతా ఆయన్ని మానసికంగా, ఉల్లాసంగా ఉంచగలిగితే మందుల పనే ఉండదు" అన్నాడు డాక్టరు.

ఊరటగా ఊపిరి పీల్చుకున్నాడు సందీప్.

భార్యని పిలిచి నాన్నకి ఎప్పుడేం కావాలో అడిగి అమర్చమన్నాడు. పిల్లల్ని సాయంత్రాలు క్రికెట్ కెళ్లకుండా తాతయ్య దగ్గరే కూర్చుని కథలు చెప్పించుకోమన్నాడు. నాలుగు రోజుల కోమారు తను తీరిక చేసుకుని తండ్రిని అక్కడికి ఇక్కడికి తిప్పి తీసుకొస్తున్నాడు. విశ్రాంతి సమయంలో తప్ప అతనిని ఒంటరిగా విడిచిపెట్టవద్దని




కుటుంబ సభ్యుల్ని ఆదేశించాడు. ఎన్ని చేసినా కన్న తండ్రిలో ఆశించిన మార్పు కానరాకపోవడంతో సందీప్‌కి దిగులు పట్టుకుంది. తల్లి బతికున్నా బావుణ్ణు. నాన్నకీ వయసులో కాస్త తోడుగా ఉండేదనుకున్నాడు.

సందీప్ పుస్తకాల పురుగు, కనిపించిన ప్రతి పుస్తకం చదువుతాడు. సెలవు దినాల్లో కంపల్సరీగా లైబ్రరీకి వెళతాడు. రచయితలంటే విపరీతమైన క్రేజ్. కథ, కవిత ఏదైనా తన మనసుకు హత్తుకుంటే చాలు. ఆ రచయితకు ఉత్తరాలు రాస్తాడు. బలరాం తన అభిమాన కథా రచయిత. అతడు రాసిన ప్రేమ కథలు కోకొల్లలు. సరస కథలు రాయడంలో అతడికతడే సాటి. శృంగార కథల పోటీల్లో తరచూ విజేత కావడమే అందుకు నిదర్శనం. అతడి రచనలు చదివిన యువతీ యువకులు గాలిలో తేలిపోతూ ఉంటారు. ఒక్కముక్కలో చెప్పాలంటే బలరాం అన్నా, అతడి రచనలన్నా యువత పడి చస్తుంది.

పోతే తనెన్ని ఉత్తరాలు రాసినా బలరాం నుండి మాత్రం సమాధానం పొందలేకపోతున్నాడు సందీప్. యువతను ఉర్రూతలూగించే ఆ సరస శిఖామణి ఎలా ఉంటాడో చూడాలని ఉందతనికి. కనీసం అతగాడి ఫోటో చూద్దామన్నా ఏ పత్రిక లోనూ కానవచ్చేది కాదు. అర్హత లేకున్నా గుర్తింపు కోసం ప్రాకులాడే వాళ్లనెంత మందినో తను చూస్తున్నాడు. మరి అన్నీ ఉండి ఇతడెందుకంత అజ్ఞాతంగా ఉంటున్నాడో తెలీడం లేదు.

ఇలా ఉండగా బలరాంకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్న

శుభవార్త అభిమానుల హృదయాల్ని పరవశింపజేసింది. స్థానిక సంస్థలు, శ్రేయోభిలాషులు అతనిని ఘనంగా సన్మానించ సంకల్పించారు.

ఆలస్యంగానైనా తన అభిమాన రచయితను దగ్గర నుంచి చూసే అదృష్టం కలుగుతున్నందుకు సందీప్‌కి ఎంతో సంతోషంగా ఉంది. ఆ రోజు కోసం ప్రతి రోజూ ఆశగా ఎదురు చూస్తున్నాడు.

ఆ శుభ ఘడియ రానే వచ్చింది.

ప్రఖ్యాత కథా రచయిత బలరాం గారికి ఘన సన్మానం అంటూ అట్టహాసంగా ప్రచారం జరుగుతోంది. సందీప్ ఆనందానికి అవధుల్లేవు. సాహిత్య కార్యక్రమాలు మనోవికాసానికి ఎంతగానో దోహదపడతాయని తలచి తండ్రిని కూడా వెంటేసుకుని వెళ్లాడు.

ప్రేక్షక జనంతో సభాస్థలి ఇసుక వేస్తే రాలనంతగా ఉంది. మీటింగ్ ప్రారంభం కాగానే బలరాంను వేదిక మీదకు పిలిచి సభకు పరిచయం చేశారు.

అతన్ని చూసి ఆశ్చర్యపోయాడు సందీప్. హృద్యంగా, కడు రమ్యంగా రచనలు సాగించే తన ప్రేమ కథా రచయిత నవ యువకుడై ఉంటాడనుకున్నాడు. కాకుంటే మధ్య వయస్కుడైనా అయి ఉండాలి. ఇహ కన్నె పిల్లల విషయానికి వస్తే వాళ్లు బలరాంను బలరాం చిత్రంలో హీరోగానే ఊహించుకున్నారు. అయితే అందరి అంచనాలను తారుమారు చేస్తూ ఓ వయో వృద్ధుడు స్టేజీ మీదకొచ్చాడు. అతడు వయసు మీరినవాడైనా చలాకీగా ఉన్నాడు. ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు. నిర్వాహకులు ఆయన్ని ప్రత్యేక ఆసనం మీద కూర్చోబెట్టి పూలమాలలతో, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. వక్తల ఉపన్యాసాలు ఊపందుకున్నాయి. చివరిగా సన్మానితుని సమాధానం అన్నారు అధ్యక్షుల వారు.

శాలువా సర్దుకుంటూ లేచి నిలబడ్డారు బలరాం. చప్పట్లు మార్మోగాయ్. అతడేం చెబుతాడాని అంతా రెప్పవేయకుండా చూస్తున్నారు.

"అందరికీ నమస్కారాలు!

నా ఈ ఘన సన్మానానికి కారకులైన వారందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.....

పోతే ఎన్నో ఎన్నెన్నో సరస శృంగార కథా కావ్యాల్ని పండించిన రచయితేనా వీడు అని మీరంతా ఆశ్చర్యపోవచ్చు. వయసు అన్నది శరీరానికే కానీ మనసుకు ఉండదు. ఎన్నేళ్లు నిండినా మనసుని నిత్య నూతనంగా ఉంచుకోవచ్చు. అందుకు చక్కని వ్యాపకం ఉండాలి. ఆ వ్యాపకం ఏదో ఒక రంగంలో తనకు కీర్తి ప్రతిష్ఠల్ని ఇనుమడింపజేసేదిగా

ఉంటే ఎన్నైనా అద్భుతాల్ని చేసి చూపించవచ్చు. వ్యాధులు, బాధలు అతని దరిజేరవు. నాకు ఇప్పుడు ఎనభై ఆరేళ్లు, కానీ నా మనసుకు మాత్రం పదహారేళ్ళే" అంటూ కథా ప్రక్రియలో తన అనుభవాలన్నింటినీ కళ్లకు కట్టినట్లు చెప్పసాగాడు.

"నాన్నా! బలరాం గారిని చూశాకా మీకేమనిపించింది?" అని అడిగాడు సందీప్ ఇంటికొస్తూనే.

"వయసన్నది శరీరానికే కానీ మనసుకు కాదన్న నగ్న సత్యాన్ని నా గుండెలోతుల్లోకి తీసుకువెళ్లి నా కళ్లు తెరిపించాడు. బతుకు మీద ఆశ కల్పించాడు".

"అందుకే ఆయన ఎనిమిదో పడిలో పడినా మీ కంటే ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండగలుగుతున్నారు. ఔనా.....!"

"యు ఆర్ రైట్ మై సన్. రిటైరయ్యాక చేసేందుకు ఏ పనీ లేకపోవడంతో వయసు అయిపోయిందనే భావన నన్నిన్నాళ్ళూ పట్టి పీడిస్తోంది. బలరాం గారిని చూశాకా నేనెంత తెలివి తక్కువగా ఆలోచిస్తున్నానా అని అనిపించింది."

"సో, మీరు కూడా ఇకపై ఏదో ఒక ప్రక్రియను చేపట్టండి. వృత్తి నుండి విశ్రాంతి తీసుకున్ననాడే ఎవరైనా ప్రవృత్తికి పూర్తి న్యాయం చేయగలుగుతారు."

"చెప్పింది బాగానే ఉంది. కానీ నేనేం చేయాలో తెలియడం లేదు."

"దీనికింత ఆలోచన దేనికి నాన్నా..... మీరు చిన్నతనంలో ఎంతో అద్భుతంగా చిత్రాలు గీసేవారని నానమ్మ చెప్పేది. పూర్వజన్మ సుకృతం ఉంటే తప్ప సంగీత సాహిత్య చిత్రలేఖనం లాంటి కళలు ఎవరికీ అంత సులువుగా వంటబట్టవు. మీకు ఆర్ట్‌లో ఎలానూ ప్రవేశం ఉంది కనుక మీ కుంచెను ఝుళిపించి ప్రకృతి అందచందాల్ని లోకానికి చూపించండి" అన్నాడు సందీప్. మరుక్షణం బజారుకెళ్లి బొమ్మలు గీసేందుకు అవసరమయ్యే కుంచెలు, రంగులు, కాగితాలు కొనుక్కొచ్చాడు. తన అభిమాన రచయితే తండ్రికి ప్రేరణ కావడంతో బలరాంకి మనసులోనే హేట్సాఫ్ చెప్పుకున్నాడు.

( 4 నవంబర్, 2001 ఆంధ్రప్రభ డైలీ )